క్లుప్తంగా

కిశోర బాలికలకు అవగాహన



బంటుమిల్లి: కిశోర బాలికలు చదువుపై శ్రద్ధ ఉంచి భవిష్యత్తును హైస్కూలు స్థాయిలోనే నిర్ణయించుకోవాలని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం.సముద్రవేణి, ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కిశోర బాలికల అవగాహన సదస్సు నిర్వహించారు. సఖి వన్ స్టాఫ్ సెంటర్ సునీత బాలికలకు హెల్ప్‌లైన్ సేవల గురించి ఫోక్సో చట్టం తదితర అంశాల గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సుధ, సూపర్‌వైజర్ ఎస్.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



పెడన: పెడన నియోజకవర్గంలోని అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం 19 మందికి రూ.19,76,082 విలువైన చెక్కులను బాధితులకు, బాధిత కుటుంబ సభ్యులకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధశారం అందజేశారు. పెడన బంటుమిల్లి రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన జెడ్పీటీసీ సభ్యుడు ఆర్జా వెంకటనగేష్, మాజీ కౌన్సిలర్ బెజవాడ నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



చల్లపల్లి(అవనిగడ్డ): రాష్ట్రస్థాయి స్కే పోటీల్లో స్థానిక సెయింట్ మదర్‌థెరిస్సా హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఆంద్రూగోమ్స్ తెలిపారు. ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా నలుగురికి బంగారు, ఒకరికి రజత పతకం వచ్చినట్టు చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి స్కే పోటీలకు బంగారు పతకాలు సాధించిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు స్థానిక స్కూల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ సుబ్బు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు



కోనేరుసెంటర్: ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ బి.బీరయ్య తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథోపన్యాసం చేశారు. బీరయ్య మాట్లాడుతూ ఎమ్మెస్సీ అనంతరం విద్యార్థులు ఉన్నత విద్య నిమిత్తం సి.ఎస్.ఐ.ఆర్, గేట్ వంటి అర్హత పరీక్షలు రాసి ప్రఖ్యాతిగాంచిన విద్యా సంస్థల్లో పరిశోధనలు చేయాలని చెప్పారు. విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ విభాగాధిపతి డాక్టర్ డి. రామశేఖర్‌రెడ్డి, విభాగ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

నిర్వీర్యమే లక్ష్యమా?

- సచివాలయాలకు సహాయ నిరాకరణ
- సచివాలయాలపై నగరపాలక సంస్థ చిన్నచూపు
- పని చేయని కంప్యూటర్లు, ప్రింటర్లు, బయోమెట్రిక్ పరికరాలు
- కనీసం స్టేషనరీ, ఇంకు సరఫరా నిల్
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



నగరంలోని 13వ డివిజన్ సచివాలయం

మచిలీపట్నంటౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పని చేసిన సచివాలయాలు నేడు గాల్లో దీపాలుగా మారాయి. ప్రస్తుతం సచివాలయాల్లో నెలకొన్న పరిస్థితులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

నగరంలోని 51 వార్డు సచివాలయాలు..

నగరంలోని 51 వార్డు సచివాలయాలు ఉన్నాయి. 50 డివిజన్‌లలోనూ ఒక సచివాలయంతో పాటు నగరపాలక సంస్థ కార్యాలయంలో వీటన్నింటినీ అనుసంధానిస్తూ మరో సచివాయాన్ని ఏర్పాటు చేశారు. గత ఎన్నికల వరకూ పూర్తి స్థాయిలో పని చేసిన సచివాలయాలు ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిర్వహణను గాలికి వదిలేశారు. సచివాలయాల్లోని వివిధ విభాగాల కార్యదర్శులతో పని చేయించుకోవటం తప్ప సచివాలయాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలను ఒక్కొక్కటిగా నిలిపివేయడం విశేషం.

పని చేయని కంప్యూటర్లు, ప్రింటర్లు, బయోమెట్రిక్ పరికరాలు..

పలు సచివాలయాల్లో ప్రస్తుతం కంప్యూటర్లు, ప్రింటర్లు, బయోమెట్రిక్ పరికరాలు పనిచేయటం లేదు. దీంతో సచివాలయ కార్యదర్శులు ఏ పనీ చేయలేని స్థితిలో పడ్డారు. వీటికి తోడు ప్రజలకు పలు రకాల దరఖాస్తులను సైతం ఇచ్చేందుకు ఏ ఫోర్, లీగల్ తెల్లకాగితాలు, ప్రింటర్‌లకు అవసరమైన ఇంక్ సైతం సరఫరాను నిలిపివేశారు. పలు సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలకు సచివాలయ సిబ్బంది ఇక్కడి సమస్యలను వివరిస్తుంటే ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎన్నికల నాటి వరకూ సచివాలయాల్లో అన్ని సక్రమంగా ఉన్నా ఆ తర్వాత నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోకపోవటంతో సమస్యలు పేరుకుపోతున్నాయి.

సహాయ నిరాకరణ..

గత ప్రభుత్వ హయాంలో సచివాలయాలకు అవసరమైన ప్రతి వస్తువును నగరపాలక సంస్థ నుంచే సమకూరేవి. ఎవరి ఆదేశాలు వచ్చాయోకాని ప్రస్తుతం ఆ విధానానికి అధికారులు స్వస్తి చెప్పారని తెలుస్తోంది. డిశంబర్ నెలలో ప్రభుత్వం పలు పథకాల అమలుకు దరాఖాస్తులు ఆహ్వానిస్తుందని సోషల్ మీడియాలో ప్రకటనలు వస్తున్నాయి. ఇదే నిజమైతే మరి ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల్లో స్టేషనరీ లేకపోవటంతో ఇబ్బందులు తప్పవని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు.

వసతులు కల్పించకుండానే..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వార్డు వలంటీర్లను తొలగించటంతో ప్రతి నెలా సామాజిక పింఛన్ల పంపిణీ నుంచి పలు రకాల సర్వేలను సచివాలయ కార్యదర్శులతోనే చేయిస్తున్నారు. అయితే పింఛన్ల పంపిణీకి బయోమెట్రిక్ పరికరాలు ఎంతో అవసరం. అవి మరమ్మతులకు గురై పని చేయకపోవటంతో కార్యదర్శులు ఫోన్‌లో ఆధార్ అనుసంధాన ఫొటోలు తీస్తూ లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేస్తున్నారు.



13వ డివిజన్ సచివాలయంలో ఇలా..

గతంలో ఇలా..

సచివాలయాల ద్వారా గతంలో ప్రభుత్వం నిర్వహించిన పనులన్నీ ప్రస్తుత ప్రభుత్వంలో నిలిచిపోయాయి. వివిధ సర్టిఫికెట్లకోసం పట్టణ ప్రజలు సచివాలయాల నుంచి దరఖాస్తు చేసుకునేవారు. ప్రభుత్వ పథకాలకూ సచివాలయాల నుంచే దరఖాస్తు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు మారిపోయాయి. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన పనులను ఆపేసి ప్రస్తుతం ఇతర పనులను అప్పగిస్తున్నట్టు తెలుస్తోంది.

స్టేషనరీ గతంలో ఇచ్చాం..

నగరంలోని అన్ని సచివాలయాలకు గత ప్రభుత్వ హయాంలో వారికి అవసరమైన స్టేషనరీని ఇచ్చేవాళ్లం. ప్రస్తుతం ఇవ్వకుండా ఆపేశాం. గతంలో ప్రభుత్వం నుంచి వచ్చే మెటీరియల్‌తో పాటు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కూడా ఇచ్చేవాళ్లం., కానీ ప్రస్తుతం అలాంటిది జరగటం లేదు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, కమిషనర్, నగరపాలక సంస్థ, మచిలీపట్నం

బుసక లోడు ట్రాక్టర్లకు జరిమానా



పెడన: మండల పరిధిలో నందమూరు నుంచి మడక వస్తున్న బుసక ట్రాక్టర్లను బుధవారం ఇన్‌చార్జి ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వో రహీంలు పట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. తహసీల్దారు కె. అనిల్‌కుమార్ ట్రాక్టర్ల విషయమై మాట్లాడుతూ రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని, ఒక్కో ట్రాక్టరుకు రూ.5 జరిమానా వేశామన్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 8 ట్రాక్టర్లను పట్టుకుని అపరాధ రుసుం కింద రూ.40 వేలు జమ చేయించామని తెలిపారు. అనుమతులు లేకుండా బుసక తరలిస్తే జరిమానాలు విధిస్తామని చెప్పారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుద్ధ్య, డ్రెయిన్‌లు, వీధి దీపాలు, ఆక్రమణలు సమస్యల పరిష్కారానికి నగర పాలక సంస్థలోని 'మీకోసం' విభాగానికి ఫిర్యాదు చేయాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విభాగానికి సంబంధించిన 98499 07989 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్ ద్వారా, నేరుగా మీ కోసం విభాగంలో వినతి పత్రం ఇవ్వొచ్చన్నారు. వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ధాన్యం సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్ బాలాజీ



తరకటూరుపాలెంలో గోమతి రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ బాలాజీ

గూడూరు: ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించిన కలెక్టర్ ధాన్యం సేకరణ జరుగుతున్న తీరుపై రైతులతో మాట్లాడారు. అనంతరం తరకటూరుపాలెంలోని రైసు మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాగంటి రంగబాబు, బాపూజీ మాట్లాడుతూ ఈనెల 25న కోత కోసి ధాన్యం మిల్లుకు తోలామని, ఇప్పటికీ ఆన్‌లైన్ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే ఆన్‌లైన్ చేయాలని సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతర తరకటూరుపాలెంలోని గోమతి రైస్ మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు ఒకేసారి యంత్రాలతో కోతలు కోయించడం వల్ల ఒకే సారి ఎక్కువ పరిణామంలో ధాన్యం మిల్లుకు వస్తుందన్నారు. మిల్లు కెపాసిటీని బట్టి రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నామని వివరించారు. వెబ్‌సైట్ సమస్య కారణంగా బియ్యం ఉత్పత్తి ప్రారంభం కాలేదని మిల్లు ప్రతినిధి కలెక్టర్‌కు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా మిల్లర్లు సహకరించాలని ఆయన కోరారు. గూడూరు ఏఓ కె.నాగేంద్రకుమార్, డీటీ పామర్తి శ్రీనివాస్, ఆర్ఐ టి.రాధ, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్.ఐ రాజేష్, మహిళా ప్రతినిధులు



ఘంటసాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

ఘంటసాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. చట్టరీత్యా 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని తెలిపారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

నాగాయలంక: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాగాయలంక పోలీస్ స్టేషన్, వాసవీ మహిళా మండలి చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్.ఐ కలిదిండి రాజేష్ మాట్లాడుతూ గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. బాలికలతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్‌ఎం పీవీఎన్‌వీ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నిర్మల, మహిళా మండలి ప్రతినిధి కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులు తెలుసుకోవాలి

చల్లపల్లి(అవనిగడ్డ): స్థానిక ఎస్ఆర్‌వైఎస్పీ హైస్కూల్‌లో బాల్య వివాహరహిత భారతదేశంపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. చల్లపల్లి- 1 సచివాలయ జీఎంఎస్‌కే (గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి) వేమూరి లావణ్య మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికల హక్కులు, భవిష్యత్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సుదర్శన్, అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ గంగాభవాని, ఈశ్వరి, పద్మజాకుమారి, రమణకుమారి, సత్యవతి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలేక అన్నదాతల ఆందోళన



మోపిదేవి: ఒక వైపు ప్రకృతి కన్నెర చేస్తుండగా, మరో వైపు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో దోబూచులాడటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో మాసూలు చేసిన ధాన్యం నిలవచేసుకోవడానికి అవకాశం లేక రోడ్ల పైన ఆరపెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బస్తా ధాన్యం రూ.1700 నుంచి 1800 వరకు కొనుగోలు చేసిందని రైతులు తెలిపారు. ప్రస్తుతం రూ.1300 నుంచి రూ.1,400 వరకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక సమస్యల కారణంగా వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తుందంటున్నారు. గత ప్రభుత్వంలో బీపీటీ రకం కనీస మద్దతు ధర రూ.2,000 ఉంటే ప్రస్తుతం బీపీటీ ధాన్యం కొనుగోలు చేసేవారే ముందుకు రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. రైతే రాజుగా పిలవబడిన అన్నపూర్ణ లాంటి ఆంధ్రరాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వంలో రైతన్నకు అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయని వాపోయారు. మిషన్ కటింగ్‌తో మాసూలు చేసిన ధాన్యాన్ని నిలవ చేసేందుకు చిన్న, సన్నకారు రైతులకు కనీసం గోదాము కూడా అందుబాటులో లేదన్నారు. దీంతో రోడ్లపై ఆరపెట్టుకునే దుస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. తుఫాన్ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మాసూలు చేసిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కాపు సేవాసమితి వనసమారాధన

బంటుమిల్లి: స్థానిక మాజీ ఎంపీపీ పంచకర్ల శివశంకరరావు స్వగృహంలో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. కాపు సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధనలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమారాధనలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వరికంకుల అలంకరణ



భావదేవరపల్లిలో వరి కంకులతో అలంకృతులైన శ్రీకాశీవిశ్వేశ్వరుడు, వినాయకుడు

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలోని భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు కె.సుబ్బారావు నేతృత్వంలో బుధవారం శ్రీవిశ్వేశ్వరస్వామి, శ్రీవినాయకస్వామిలను వరి కంకులతో అలంకరించారు. గ్రామంలోని రైతులు కొందరు తమ పొలాల్లో వరి కుంకులను ఆలయానికి సమర్పించగా అర్చకుడు అభిషేకాలు జరిపిన స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.

అర్ధనారీశ్వరుడిగా..

నాగాయలంకలోని శ్రీపార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశిరావు ఆధ్వర్యంలో కొల్లిపర సుబ్బారావు స్వామిని అర్ధనారీశ్వర స్వరూపాన్ని తీర్చిదిద్దారు. తొలుత పలు రకాల సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పరిమళాలాలు, భస్మంతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిపారు.

శ్రీకాకుళం(ఘంటసాల): కార్తికమాసం సందర్భంగా మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జునస్వామి దేవస్థానంలోని బుధవారం అన్నాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు లంక వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీకాకుళం గ్రామానికి చెందిన కొండవీటి కోటి, మేకా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి 65 కేజీల బియ్యంతో అన్నాభిషేకం జరిపించారు. రావూరి శ్రీనివాసరావు, సారేపల్లి శ్రీను, గాజుల సత్యనారాయణ, యడ్లపల్లి హనుమంతురావు, గాదె వెంకటేశ్వరరావు, గ్రామస్తుల సహకారంతో రెండు వేల మందికి పైగా భక్తులకు అన్న సంతర్పణ చేశారు. శ్రీకాకుళం పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

చోడవరం(నాగాయలంక): మండలంలోని చోడవరం పురాతనమైన శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయం అర్చకుడు ముదునూరి అత్యుతశర్మ ఆధ్వర్యంలో బుధవారం కార్తిక విశేష పూజలు జరిపి నాగపడగతో విశేష అలంకారం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. గ్రామ మహిళలు ఆలయ ప్రాంగణంలో ప్రమిదలలో కార్తిక వత్తులు వెలిగించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. గణపేశ్వరంలోని శ్రీదుర్గా గణపేశ్వరస్వామి ఆలయం, టీ కొత్తపాలెం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శివయ్యను దర్శించుకుకున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



బంటుమిల్లి శివాలయంలో లక్ష బిల్వార్చన చేస్తున్న భక్తులు

బంటుమిల్లి: స్థానిక శ్రీ గంగా, పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో బుదవారం స్వామివారికి లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్ష పూజలు భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ట్రస్టీ జోశ్యుల విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పండితులు గూటాల పుల్లయ్యశాస్త్రి తదితర పండితుల వేద మంత్రాల మధ్య ఉదయం స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్ష పూజలు వైభవంగా నిర్వహించారు. తదననతరం అమ్మవారికి సహస్ర కుంకుమపూజలు భక్తులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోశ్యుల చంద్రశేఖర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురు పృధ్వీశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి లక్ష బిల్వార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అవనిగడ్డకు చెందిన పోతరాజు శ్రీనివాసరావు, వెంకటరమణ సోదరులు ద్రవ్యసహకారం అందించగా, లంక శ్యామసుందరశాస్త్రి నేతృత్వంలో 20 మంది వేద పండితులు ఈ కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపించారు. తొలుత స్వామివారికి నవవిధ అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మామిడి సస్యరక్షణపై అవగాహన

అవనిగడ్డ: మామిడి పంటకు ఆశించే తెగుళ్ళ నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మామిడిలో ఆశించే పేనుబంక, కాయతొలుచు పురుగు నివారణకు చేపట్టే పురుగు మందు పిచికారీలో వేపనూనె కలపడం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి రమేష్, ఏవో కొక్కిలిగడ్డ తనూజ, పలువురు సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్



అవనిగడ్డ: స్థానిక సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో బుధవారం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. పార్లమెంటరీ సభను తలపించేలా సెట్‌చేసి సమావేశాలు జరిపించారు. ప్రధానమంత్రి, హోమ్‌మంత్రి, ఆరోగ్యశాఖ, ప్రతిపక్షనేత, స్పీకర్, విద్యాశాఖామంత్రి పాత్రలో పలువురు విద్యార్థులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మన పార్లమెంట్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ప్రిన్సిపాల్ అమలాపుష్పం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనర్థాలు తెలుసుకోవాలి

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాసవి మహిళా మండలి జిల్లా కోఆర్డినేటర్ పి.శాంతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కైంకర్యాలకు రూ.4 లక్షలు వితరణ



గంగానమ్మ అమ్మ వారి నెలవారి కైంకర్యాలకు నగదు అందిస్తున్న దాత వేములపల్లి పుష్పావతి

చిట్టూర్పు(ఘంటసాల): మండలంలోని చిట్టూర్పు గ్రామంలో గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో నెలవారీ కైంకర్యాల నిమిత్తం గ్రామానికి చెందిన వేములపల్లి పుష్పావతి రూ.4 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందించారు. చిట్టూర్పు గ్రామానికి చెందిన వేములపల్లి సుబ్బయ్య- రత్నమాణిక్యం దంపతుల కుమారుడు మాజీ సర్పంచ్ వేములపల్లి వెంకట రామ్మోహనరావు జ్ఞాపకార్థం రామ్మోహనరావు సతీమణి పుష్పావతి కుటుంబ సభ్యులు రూ.4 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రావు, కనకమల్లేశ్వరి, గుత్తికొండ ప్రసాద్‌లకు దేవాలయంలో అందించారు. ముందుగా అమ్మ వారికి దాత పుష్పావతి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాత పుష్పావతి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.